వ్యవసాయశాఖ ఎడిఎలు బదిలీ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాల వ్యవసాయశాఖ ఎడిఎ స్థాయి అధికారులను బదిలీ చేస్తూ జిఒఆర్‌టి 441, 443 పేరిట మాడిఫికేషన్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఏడాది జూన్ 25న ఉభయ జిల్లాలోని మైదుకూరు, రైల్వేకోడూరు వ్యవసాయశాఖ ఎడిఎలను ప్రభుత్వం బదిలీ చేసింది. అనంతరం అనివార్య కారణాల రీత్యా వారిని ఆయా జిల్లాల జెడి కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. అనంతరం ప్రభుత్వం గురువారం మైదుకూరు ఎడిఎ వర్ధమాను వెంకటసుబ్బయ్యను బద్వేలుకు, రైల్వేకోడూరు ఎడిఎ కందుల కలిశను చిత్తూరు జిల్లా నగరి బదిలీ చేస్తూ మాడిఫికేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇద్దరు ఎడిఎలు శుక్రవారం రిలీవ్‌పై వెళ్లి ఆయా ప్రాంతాల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

విద్యార్థిని హత్యపై వీడని మిస్టరీ

- 'గండికోట'లో ఏమి జరిగింది?
- విచారణలో లోపమా!
- మళ్లీ నిఘానేత్రాల పరిశీలన
- ప్రత్యేక బృందంతో విచారణ

గండికోట పరిసరాలను పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఈ నెల 14న జరిగిన ఇంటర్ విద్యార్థిని హత్య కేసు మిస్టరీగా మారింది. ఆమె మర్డర్ కేసు గండికోట రహస్యం లాగా మారింది. అసలు కోట లోపల ఏం జరిగింది అనేది మూడు రోజులైనా పోలీసులకు అంతుచిక్కడం లేదు. నిఘా నేత్రాలలో (సిసి కెమెరాలు) విద్యార్థిని విద్యార్థిని ప్రియుడు లోకేష్ 10:40 నిమిషాలకు కోటను వదిలి వెళ్లాడని, హత్య వేసాకా అతని హస్తం లేదని డిఐజి గండికోటలో పెట్టిన ప్రెస్ మీట్‌లో స్పష్టంగా తేల్చి చెప్పారు. మరి ఆమెను చంపింది ఎవరు అని విలేకరులు ప్రశ్నిస్తే అందుకు బుధవారం ఉదయం మర్డర్‌కు గల క్లూ దొరికిందని సాయంత్రం 9 లోపు డిఎస్‌పి లేదా ఎస్‌పి ప్రెస్ మీట్ ద్వారా వెల్లడిస్తారని చెప్పిన డిఐజి మాటలలో వాస్తవం లేదని అర్థమైంది. డిఎస్‌పి, ఎస్‌పి ప్రెస్ మీట్ పెట్టకపోవడం వెనక వారికి దొరికిన క్లూస్‌లో నిజం లేదేమో అనే అనుమానం కల్గుతోంది. కేవలం అనుమానమేనా లేక ప్రతి పక్షాలు మర్డర్ గురించి మాట్లాడకుండా ఉండేందుకు ఇలా చెప్పారా అనేది కూడా ప్రజలు చర్చించుకుంటున్నారు. విద్యార్థిని హత్యలో లోకేష్ లేనప్పుడు ఇక అమ్మాయి సంబంధించిన వ్యక్తి గండికోటలో ఉన్నది సురేంద్ర. అతనే ఒక్కడే వైప్లైన హత్య చేసి ఉంటారని అనుకోవడంలో కూడా పొరపాటు ఉంది. ఎందుకంటే డిఐజి కోయ ప్రవీణ్ విచారణలో అమ్మాయి మృతదేహం పడి ఉన్న ప్రదేశాన్ని చూసిన తర్వాత ఒక్కరే హత్య చేసి ఉండరని ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది హత్య లో భాగమై ఉంటారని ఎస్‌పి, ఇతర పోలీస్ సిబ్బందితో చెప్పినట్టు తెలిసింది. అలాంటప్పుడు సురేంద్ర గండికోటకు స్నేహితులతో ఏమైనా వచ్చాడా? లేక కిరాయి వ్యక్తులకు చెప్పి చేశాడా ? అనేది ఇక్కడ మొదలైన ప్రశ్న?. అందుకు తగ్గట్టుగానే గురువారం ఉదయం నుంచి పోలీసులు మళ్లీ సిసి కెమెరాలు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ఎటు చూసినా ఒకటిన్నర కిలోమీటరు : కోట లోపలికి పోవడానికి, రావడానికి ఒకే ప్రవేశద్వారం. లోపలికి వెళ్లిన వారు ఎటు చూసినా ఒకటిన్నర కిలోమీటర్లు మాత్రమే. అందులో ఉన్న వారిని గుర్తించడానికి మూడు రోజులు సమయం పట్టిందంటే అదే బయట ప్రాంతం లేదా సిటీ ప్రాంతమై ఉంటే ఇంకా ఎంతకాలం పడుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. శని, ఆదివారాల్లో అయితే గండికోటలో ఎక్కువమంది పర్యాటకులు ఉండేవారని సోమవారము కావడం వల్ల తక్కువ సంఖ్యలో పర్యాటకులు ఉండే అవకాశం కూడా ఉందని మరో వాదన వినపడుతోంది.

అమ్మాయికి గాయాలు : పోస్టు మార్టంలో కాలేయం దెబ్బతిన్నట్లు, ఛాతిపై, కాళ్లకు, కంటి వద్ద గాయాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పోస్ట్‌మార్టం సంబంధించిన పూర్తి నివేదిక కూడా బయటికి రాని పరిస్థితి. జమ్మలమడుగు డిఎస్‌పితో పాటు మరో ఇద్దరు డిఎస్‌పిలు కలిసి సిసి కెమెరాలు పరిశీలించి టీమ్‌తో పర్యవేక్షణ చేస్తున్నారు. సాయంత్రం 5.45 వరకు ఎలాంటి సమాచారం లేదని పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది సమాచారం. పోలీస్ అధికారులు కేసుపై పెదవి విప్పడం లేదు, విచారణ జరుగుతుంది అని మాత్రమే చెబుతున్నారు.

మా బిడ్డను మేమే ఎందుకు చంపుకుంటాం : తల్లిదండ్రులు

మా బిడ్డను మేమే ఎందుకు చంపుకుంటామని తల్లిదండ్రులు మీడియా ద్వారా చెబుతున్నారు. ఒకవేళ తప్పు చేస్తే మందలిస్తామే తప్ప చంపుకోలేమని పేర్కొంటున్నారు. సొంత అన్న చంపి బట్టలు ఎందుకు తీసేస్తారని కూడా ప్రశ్నించారు. వారి మాటలు వెనక సురేంద్రను రక్షించడం తప్ప కుమార్తె చనిపోయిందనే భావన ఎక్కడ కూడా కనపడకపోవడం విచారకరమని పలువురు చర్చించుకుంటున్నారు. ఏదేమైనా గండికోటలో జరిగిన విద్యార్థిని హత్య ఒక మిస్టరీగా మారింది. ఈ మిస్టరీని పోలీసులు ఎప్పుడు చేధిస్తారో వేచి చూడాలి మరి.

విద్యార్థిని తల్లిదండ్రులను విచారిస్తున్న పోలీసులు : గండికోటలో విద్యార్థిని హత్య కేసుకు సంబంధించి ప్రొద్దుటూరు పోలీసులు విచారిస్తున్నారు. అసలు హత్య ఎవరు, ఎందుకు చేశారనే కోణంలో విచారణ చేపడుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యార్థిని హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్: గండికోటలో ఈనెల 14న చోటు చేసుకున్న విద్యార్థిని హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు ఐఎన్ సుబ్బమ్మ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద విద్యార్థినులు, మహిళలతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఏవో మహబూబ్ బాషా కి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అమ్మాయిలను చంపడం, హత్యాచారాలు చేయడం, దారుణానికి పాల్పడడం పరిపాటిగా మారిందన్నారు. ఇలాంటి సంఘటనలు జరగడం బాధాకరమని తెలిపారు. విద్యార్థిని హత్యకు కారకులైన, ఎంతటి వారినైనా విచారించి బాధ్యులపై కఠినంగా శిక్షించాలని కోరారు. కార్య క్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి జి.ఏసుదాసు, సిఐటియు పట్టణ కార్యదర్శి విజయ్, సిఐటియు ఉపాధ్యక్షులు వినయ్ కుమార్, అంగన్వాడీవర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వి.భాగ్యలక్ష్మి కె.లక్ష్మి దేవి, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రసాద్ రెడ్డి, నరేంద్ర , మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి శేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు జెర్మియా పట్టణ సహాయ కార్యదర్శి హరిబాబు , ఎస్ఎఫ్ఐ నాయకులు ఖాదరు, స్వాతి, గురు లక్ష్మి వి.స్వాతి, డివైఎఫ్ఐ నాయకులు బాల నరసింహులు, ఆటో కార్మికులు విద్యార్థులు పాల్గొన్నారు.

జిఎంసిలో కాంట్రాక్టు నియామకాలకు బ్రేక్

- 23 ప్రొఫెసర్, అసోసియేట్ పోస్టుల భర్తీకి గ్రహణం
- సూపర్ స్పెషాలిటీని వేధిస్తున్న స్టాఫ్ నర్సుల కొరత
- 'సూపర్' సేవలపై దుష్ప్రభావం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాంట్రాక్టు ఫ్యాకల్టీ నియామకాలకు బ్రేక్ పడింది. ఈనెల 17న జిఎంసి ప్యాకల్టీలోని ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాలను చేపట్టాల్సి ఉంది. జిఎంసి పాలనా యంత్రాంగం నోటిఫికేషన్ సైతం విడుదల చేసింది. 2014-19 పీరి యడ్‌లో జూనియర్ డాక్టర్లు సీనియర్లుగా మారిన పరిస్థితుల నేపథ్యం వివాదా స్పదంగా మారింది. ప్రభుత్వం ఏడాది పాటు కనీస బోధనానుభవం కలిగిన అధ్యాపకులకు ప్రొఫెసర్, అసోసియేటెడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లను ప్రమోషన్ ఇవ్వాలని భావించింది. జిఎంసిలో కాంట్రాక్టు నియామకాలకు బ్రేక్‌పడిన కారణంగా సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పరిధిలోని 11 ప్రొఫెసర్, ఎనిమిది అసోసియేట్, ఐదు అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు బ్రేక్ పడింది. ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపక పోస్టులను నిలిపేసిన నేపథ్యంలో సూపర్‌లో వైద్యసేవలు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వ నిబంధన మేరకు ఏడాదిపాటు బోధనానుభవం కలిగిన అధ్యాపకుల నియామకాలను వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని స్టాఫ్‌నర్సుల కొరత వేధిస్తోంది. ఇటీవల ప్రాంతీయ వైద్య విధాన పరిషత్ కార్యాలయం 140 స్టాఫ్‌నర్స్‌ల పోస్టుల భర్తీని చేపట్టింది. సుమారు 11 వేల దరఖాస్తులను స్వీకరించింది. నకిలీ మార్కుల సర్టిఫికెట్లు ఉన్నాయని తేలడంతో సంబంధిత ఎన్టీఆర్ యూనివర్శిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. సంబంధిత అధికారులు సర్టిఫికెట్లను పరిశీలించడం ఎప్పటికి పూర్తి చేస్తుందో తెలియని నేపథ్యం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని వెంటాడుతోంది. ఐదారేళ్లుగా వెంటా డుతున్న ఫేక్ సర్టిఫికెట్ల ఉదంతంపై ఓ ఉన్నతాధికారిని సంప్రదించగా ఫేక్ సర్టిఫికెట్లుగా తేలితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేయడం దగ్గర నుంచి, సర్టిఫికెట్ల ధ్రువీకరణ పూర్తయ్యే వరకు జీతాలు చెల్లించ బోమనే నిబంధనల మేరకు రిక్రూట్‌మెంట్ చేస్తే ఫేక్ సర్టిఫికెట్ల పరిస్థితే తలెత్త బోదని, క్వాలిటీ నర్సింగ్ సేవలకు అంతరాయం తలెత్తబోదని పేర్కొనడం గమనార్హం.

ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంపొందించాలి
- ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ సేవలపై ప్రజాస్పందనల సంతృప్తి స్థాయిని పెంపొందించే విధంగా పురోగతి సాధించాలని ఇన్‌ఛార్జి కలెక్టర్, జెసి అదితి సింగ్ అన్ని శాఖల జిల్లా అధికారులకు సూచించారు. గురువారం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో పలు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక కలెక్టరేట్‌లో బోర్డు మీటింగ్ హాలు నుంచి ఇన్‌ఛార్జి కలెక్టర్ హాజరయ్యారు. రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జీరో పావర్టీ, పి 4 పాలసీ, బంగారుకుటుంబాలు, మార్గదర్శులు, గామ సభలు, జనాభా నిర్వహణ వంటి అంశాలపై జిల్లా కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు. సర్క్యులర్ ఎకానమీ క్లస్టర్స్ కార్యక్రమంలో జాప్యం లేకుండా పనులనీ పూర్తి చేయాలన్నారు. విసి అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు సంతృప్త స్థాయిలో ప్రజలకు అందేలా అన్ని శాఖల జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు .ప్రభుత్వ పథకాలు సేవలు అందించడంలో ప్రజల నుంచి సానుకూలత పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాని చెప్పారు. బద్వేల్ నియోజకవర్గ లో ఎంఎస్ఎంఇని పార్కు స్టోన్ ఫౌండేషన్ పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతతో అమలు చేస్తున్న పథకాలపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఒ హజరతయ్య, పరిశ్రమల శాఖ జిఎం చాంద్ బాషా, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, ఆర్‌టిసి గోపాల్ రెడ్డి, జడ్‌పి డిప్యూటీ సిఇఒ సుబ్రమణ్యం, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి,జి ల్లా రిజిస్ట్రార్ పివిఎన్ బాబు,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రెండో పంటకు నీరు అందిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- వల్లూరు

ప్రస్తుత ఖరీఫ్‌లో రెండో పంటకు కూడా నీరు అందించేందుకు కృషి చేస్తామని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఆదినిమ్మాయపల్లి ఆనకట్ట నుంచి కెసి కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేయాలని దృఢ సంకల్పం ఉంటే ఏమైనా సాధ్యమవుతుందన్నారు. సుమారు 7500 ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందన్నారు. కెసి కెనాల్ లో ఇప్పటికే పూడికతీత పనులు, మరమతులను రూ . 1.2 కోట్లతో చేపట్టినట్లు తెలిపారు. సంక్షేమాలు, అభివృద్ధి చేస్తూ రైతులకు అన్నిరకాలుగా సహకారమందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఎన్‌డిఎ కూటమి అన్నారు. అనంతరం మిట్టపల్లి గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ప్రారంభించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అదిశేషరెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, శంకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, రైతులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కడప సిటీ : స్థానిక రైల్వేస్టేషన్, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్ల విజిలెన్స అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్‌పి మల్లికార్జునరావు, వ్యవసాయ శాఖ కర్నూల్ డిఆర్‌సి ఎడిఎ సంగు వెంకటేశ్వర్లు, టెక్నికల్ ఎఒ, జెడిఎ ఎస్ గోవర్ధన్ తో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టామని మండల వ్యవసాయ అధికారి ఎస్. వి సురేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కడప రైల్వే స్టేషన్ రేక్ పాయింట్లు, యూ రియా నిలువలను, పంపిణీ పత్రాలు పరిశీలించామన్నారు. 991 మెట్రిక్ టన్స్ యూరియా ఇక్కడి నుంచి జిల్లాలోని డీలర్స్‌కు, రైతుసేవ కేంద్రాలకు సరైన పత్రాలతో పంపిణి చేయాలనీ సూచించారు. ట్రాన్స్ పోర్టు గోడౌన్స్‌లో తనిఖీలో భాగంగా నిషేధించిన పురుగుమందులు ఏవైనా ఉన్నాయా లేదో పరిశీలించారన్నారు.

ఏడాదిలోపు మౌలిక వసతులు

ప్రజాశక్తి - కడప అర్బన్

వైఎస్ఆర్. జగనన్న కాలనీలలో ఏడాదిలోకి మౌలిక వసతులు కల్పిస్తామని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం రెండవ డివిజన్ వైఎస్ఆర్ కాలనీలో కార్పొరేటర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నుంచి టిడిపిలోకి దాదాపు 200 మంది చేరారు. వీరిని ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా తమ ఇంటికి వచ్చి మాట్లాడవచ్చని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ముందుంటామని తెలిపారు. సీనియర్లకు, కొత్తవారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది వైసిపి కార్పొరేటర్లకు తొత్తులుగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రేషన్ కార్డు అడిగితే కార్పొరేటర్ ఇంటికి పోవాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్పొరేషన్‌లో 50 డివిజన్లో 50 మంది కూటమి అభ్యర్థులు గెలిస్తే అభివృద్ధి పరుగులు పెడుతుందని పేర్కొన్నారు. మొదట వైఎస్ఆర్ కాలనీలో అభివృద్ధి చేసి చూపిస్తామని తెలిపారు మహానేత వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఏర్పాటుచేసిన కాలనీని వైసిపి నాయకులే పట్టించుకోలేదని చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సమస్యలతో తాము నిర్వహించే ప్రజా దర్బారుకు ప్రజలు హాజరవుతున్నారని తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుబ్బారెడ్డి, సూర్యనారాయణరావు, రాజగోపాల్ రెడ్డి, శ్రీధర్, సిసింద్రీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎఇని సస్పెండ్ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరం రామకృష్ణ నగర్‌లో మూడు నెలల కిందట వాటర్ ప్లాంట్ ఎదురుగా ఉన్న వీధిలో విద్యుత్ స్తంభం రోడ్డుకు అడ్డంగా ఉందని సంబంధిత అసిస్టెంట్ ఇంజినీర్ దృష్టికి తీసుకొచ్చినా ఇప్పటివరకు మార్చకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, తక్షణమే అతన్ని ఉన్నతాధికారులు సస్పెండ్ చేయాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని రామకృష్ణ నగర్‌లో ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతూ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. విద్యుత్ స్తంభం మార్చాలని, మూడు నెలలుగా విజ్ఞప్తి చేసినా ఎఇ నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని చేస్తున్న ప్రకటనలో వాస్తవం లేదని మండిపడ్డారు. చాలా కాలంగా రోడ్డుకు అడ్డంగా ఉండటం వల్ల ప్రజలు రాకపోకలకు, వాహనాలకు ఇబ్బందికరంగా ఉందని పేర్కొన్నారు. అదే వీధి చివరలో విద్యుత్ స్తంభం, అరిగిపోయి ఉందని, ప్రమాదం జరగక ముందే తక్షణమే సవరించాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నేతలకు, డబ్బులు ఇచ్చేవారికి విద్యుత్ స్తంభాలే కాకుండా ట్రాన్స్‌ఫార్మర్లు కూడా అతి తక్కువ కాలంలో ఏర్పాటు చేయడం, మార్పు చేయడం చేస్తున్నారని వాపోయారు. . సామాన్య ప్రజల సమస్యను పరిష్కరించడంలో సంబంధిత అధికారి తీవ్ర నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టాలని నిర్ణయించామన్నారు. పది రోజుల్లోగా రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని మార్చకపోతే సంబంధిత కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, కామేశ్వరమ్మ, కుమారస్వామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ, వెంకటసుబ్బయ్య, శేఖర్, మధుతో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుపుతున్న నవోదయ కోచింగ్ సెంటర్ల పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చదువు పేరుతో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా విద్యార్థులకు, తల్లిదండ్రులకు మోసపు మాటలు చెప్పి వేల రూపాయలు వసూలు చేస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకువాలని డిమాండ్ చేశారు. కడప, బద్వేల్, ప్రొద్దుటూరు పోరుమామిళ్ల ప్రాంతాల్లో వీధికి ఒకటి కోచింగ్ సెంటర్ నడుపుతున్న ఉన్నత విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వస్తున్నాయని అన్నారు. ఇప్పటి కైనా విచారించి అనుమతులు లేని కోచింగ్ సెంటర్లని సీజ్ చేసి యాజమాన్యాల పై క్రిమినల్ కేసులు నమోదు చెయ్యాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ కడప నగర కార్యదర్శి మోహన్, నగర ఉపాధ్యక్షులు శ్రీనువాసులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీకి డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

విభజన హామీలు అమలు చేయాలని, కడప ఉక్కు పరిశ్రమ నిర్మించాలని, రాయలసీమకు ప్యాకేజీ వంటి డిమాండ్లతో శుక్రవారం ఢిల్లీ లో జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాకు కడప నాయకత్వం బయలుదేరినట్లు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. గురువారం రైల్వే స్టేషన్‌లో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విభజన హామీలు మరచినదన్నారు. ఆంధ్రప్రదేశ్ కు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. కడప ఉక్కు కు నిధులు లేవు, వెనుకబడిన రాయలసీమ కు ప్యాకేజీ లేదు, ఉపాధి పరిశ్రమల ఏర్పాటు చేయలేదన్నారు. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రయివేటీకరణ చేస్తున్నారన్నారు. కేంద్రం ఆంధ్రప్రదేశ్ కు, రాయలసీమకు చేసిన మోసాన్ని ఎండగడుతూ జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే ఆదిల్, జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, నాయకులు సురేంద్ర పాల్గొన్నారు.

ఆగస్టులో ఢిల్లీలో బిసిల ధర్నా

ప్రజాశక్తి - బద్వేలు

బిసిల న్యాయమైన హక్కుల సాధన కోసం ఆగస్టు 18,19 తేదీల్లో ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు జాతీయ బిసి సంక్షేమ సంఘం బద్వేల్ నియోజకవర్గ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గురుమూర్తి పేర్కొన్నారు. గురువారం ఆర్‌టిసి మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత ధర్నా కార్యక్రమానికి బద్వేలు నియోజకవర్గం నుండి బిసిలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు సుభాన్‌బీ, మరాఠా జాతీయ అధ్యక్షులు సాగర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యు.వెంకటరమణ యాదవ్, నియోజకవర్గ కన్వీనియర్ ఎస్.ఎన్. సుబ్బరాయుడు, పట్టణ కన్వీనర్ నాగార్జున, ఆవాజ్ కమిటీ పట్టణ అధ్యక్షులు ఎస్.ఎ. సత్తార్,సభ్యులు రసూల్, ఖాజా హుసేన్, బిసి నాయకులు బాలయ్య పాల్గొన్నారు.

క్షయను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

క్షయను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే సులభంగా నయమవుతుందని మండల వైద్యాధికారి రాఘవేంద్ర పేర్కొన్నారు. గురువారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని రసూల్‌పల్లిలో టిబి ముక్తి భారత్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిబి. అనేది పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే సులభంగా ఆరోగ్యవంతులు కావచ్చునని తెలిపారు. వ్యాధి లక్షణాలు, జాగ్రత్తలు, చికిత్స గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది తలపెట్టిన ప్రచారంలో స్క్రీనింగ్ శిబిరం, ఇంటింటి సందర్శనలు, బోధన కార్యక్రమాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు వంటివి ఏర్పాటు చేశారని చెప్పారు.

ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చాలి : సిఐటియు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చాలని సిఐటియు గౌరవాధ్యక్షులు ఏసుదాసు పేర్కొన్నారు. గురువారం స్థానిక మాస్టర్ పాయింట్ వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు ఆందోళన నిర్వహించారు. కార్యక్రమానికి మద్దతుగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు జిఒ 1 , 15 ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. సంక్షేమ పథకాలు తల్లికి వందనం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వర్తింపజేయాలని కోరారు. వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేయడం దారుణమని వాపోయారు. పాత చట్టాలనే అమలు చేయాలని, ఇంజనీర్ సెక్షన్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం, రూ. 21 అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి శివన్న, మున్సిపల్ పట్టణ నాయకులు మైకల్ బాబు, చెన్నయ్య , యాకోబు, వినోద్ చంటి, జయలక్ష్మి, ప్రభావతి, ఎ.మరియమ , తిరుపాలమ్మ , లక్ష్మి పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** కార్మికులకు న్యాయం చేయాలని మున్సిపల్ కార్మిక సంక్షేమ సంఘ కార్యదర్శి సాల్మన్, ప్రభుత్వ ఆసుపత్రి కార్మిక సంఘ కార్యదర్శి రాఘవ కోరారు. కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై సిఐటియు పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్త సమిలో భాగంగా గురువారం సమ్మె 5వ రోజుకు చేరుకుంది. పారిశుధ్య కార్మికులు ఇంజినీరింగ్ కార్మికులకు మద్దతుగా సమ్మెలో పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : స్థానిక సభా భవనంలో నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశం మొక్కుబడిగా, తూతూ మంత్రంగా నిర్వహించారు. మండల సర్వసభ్య సమావేశం గురువారం మండల విస్తరణ అధికారి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలం వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నాటి నుంచి నిర్వహించిన సమావేశాల్లో అటు రెవెన్యూ పరంగా మండల తహశీల్దార్, డిటి పాల్గొనలేదని పేర్కొన్నారు. భూ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిపైన మినిట్స్ బుక్‌లో రాయాలని ఆయన అధికారులకు సూచి ంచారు. కీలకమైన సర్వసభ్య సమావేశానికి ఉన్నతాధికారులే డుమ్మా కొడితే, సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి,ఎ ందుకు మీటింగ్ పెట్టారని ఆయన ఆక్రోషం వ్యక్తం చేశారు. ఎపిఎం రాజు ఎటువంటి కారణాలు లేకుండానే ఉన్నఫలంగా యానిమేటర్లను తొలగిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు, ఎపిఎం రాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వం వహించిన వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయని వాటిని విచారించి ప్రాజెక్ట్ డైరెక్టరుకు నివేదించడం వరకే తమ బాధ్యతని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు, ఎంపిటిసిలు కొంతమంది సర్పంచులు, ఎంపిటిసిలు సభకు డుమ్మా కొట్టినట్లు నాయకులే చెప్పుకుంటున్నట్లు సమాచారం.

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి - కడప

ఎసిఎ సౌత్ జోన్ అండర్ - 16 మల్టీ డే క్రికెట్ టోర్నీలో భాగంగా మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. వైఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కడప, కర్నూలు జట్ల మధ్య ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 65.3 ఓవర్లలో 157 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రుత్విక్ కళ్యాణ్ 40, రోహిత్ గౌడ్ 35 పరుగులు చేశారు. కడప జట్టులోని చెన్నకేశవ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. జయ ప్రణవ శాస్త్రి 2, కశ్యప్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్ లో 24.0 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 54 పరుగులు చేసింది.

తలపడుతున్న కడప, కర్నూలు జట్లు

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి- చింతకొమ్మదిన్నె

సోలార్ గ్రీన్ ఎనర్జీ పేరుతో బలవంతపు భూసేకరణ ఆపాలని ఈనెల 20న నంద్యాలలో నిర్వమించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి తెలిపారు. గురువారం చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం రైతులకు సంబంధించిన వ్యవసాయ భూములను సోలార్ గ్రీన్ ఎనర్జీ పేరుతో లక్షల ఎకరాల వ్యవసాయ భూములను ప్రయివేట్, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందని అన్నారు. రైతుల అనుమతి, గ్రామ సభలు నిర్వహించకుండా బలవంతంగా భూ సేకరణ చేయడం చాలా అన్యాయమని ఆయన అన్నారు. గత ప్రభుత్వం రీ సర్వే పేరుతో రైతుల వ్యవసాయ భూముల రికార్డులను గందరగోళంగా మార్చిందని సర్వే నంబర్ స్థానంలో జాయింట్ ఎల్‌పిఎం విధానాన్ని ముందుకు తెచ్చి రైతులకు తీవ్రమైన ఇబ్బందులు కలిగించిందని ఆయన తెలిపారు. కార్పొరేట్ కంపెనీలకు భూపందారానికి వ్యతిరేకంగా సామాన్య, పేద, మధ్యతరగతి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం గురించి చర్చించేందుకు, భవిష్యత్ కార్యచరణ రూపొందించేందుకు సదస్సును నిర్వహిస్తున్నామని చెప్పారు. కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, ,మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, చిన్న సిద్దయ్యతో పాటు స్థానిక మండల రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వేతనాలను వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీలలో బదిలీలు పొందిన సగం మంది టీచర్లకు పొజిషన్ ఐడిలు లేని కారణంగా జూన్ వేతనాలు చెల్లించలేదని, వెంటనే వారికి వేతనాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామసుందర్ రెడ్డి కోరారు. గురువారం డాఇఒ షంషుద్దీన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్యామ సుందర రెడ్డి మాట్లాడుతూ జూన్‌లో జరిగిన బదిలీల్లో బదిలీలు పొంది రిలీవర్లు రాని కారణంగా పాతపాఠశాలలలోనే పనిచేస్తున్న ఉపాధ్యాయులందరిని వెంటనే రిలీవ్ చేసి నూతన పాఠశాలలకు పంపించాలని, పేర్కొన్నారు. మండల విద్యాశా ఖాధికారి కార్యాలయాల్లో అనధికారికంగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యా యులపైనా, సంబధింత ఎంఇఒలపైనా చర్యలు తీసుకోవాలని చెప్పారు కార్యక్ర మంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, పూర్వ జిల్లా అధ్యక్షుడు గురయ్య, జిల్లాకౌన్సిలర్లు రామచంద్రారెడ్డి, నరసింహులు ,గురయ్య, మణికుమార్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కడప : నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో పొలిటికల్ సైన్సు, హిస్టరీ, ఎకనామిక్స్, జియాలజీ,కంప్యూటర్ సైన్సు/అప్లికేషన్ సబ్జెక్టులకు అతిథి అధ్యాపక ఉద్యోగాలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న ఉదయం 10.30 గంటలకు ప్రిన్సిపాల్ కార్యాలయంలో హాజరు కావాలని ఆయన కోరారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ కలిగి ఉండాలని తెలిపారు. నెట్, స్లెట్, పిహెచ్‌డి అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికేట్లతో పాటు ఒక సెట్టు జిరాక్సు కాపీతో హాజరు కావాలని ఆయన కోరారు.

సకాలంలో రైతులకు ఎరువులు అందించాలి

ప్రజాశక్తి - కడప : సకాలంలో రైతులకు ఎరువులను అందించాలని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి రవీంద్రనాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాలో రైతులు పడుతున్న ఇబ్బందులను తక్షణం పరిష్కరించాలని కోరుతూ గురువారం వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సాంబటూరు ప్రసాద్ రెడ్డి, నాయకులు కడప కలెక్టరేట్‌కు ర్యాలీగా వచ్చి డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు యూరియాను ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పడుతున్న కష్టాలు కూటమి నాయకులకు ఏ మాత్రం కనిపించలేదా అని ప్రశ్నించారు. తక్షణం ప్రభుత్వం స్పందించి రైతులకు సకాలంలో ఎరువులను అందించడంతోపాటు వారి కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులకు అండగా నిలబడి వైసిపి పోరాటం సాగిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షులు అశోక్ రెడ్డి, నాయకులు పులి సునీల్ కుమార్, సురేష్ యాదవ్, షఫీ, గంటి నాగేంద్ర, త్యాగరాజు, బాబు, వినోద్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - చాపాడు

గ్రంథాలయానికి వెళ్లేలా విద్యార్థులను ప్రోత్సహించాలని శాఖ గ్రంథాలయాధికారి జె శివశంకర్ రెడ్డి ప్రధానోపాధ్యాయులను కోరారు. సెలవు దినాలు, ఆదివారం గ్రంథాలయాలకు వచ్చి చదవడం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఆ మేరకు ఆయన గురువారం చాపాడులోని ఉర్దూ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కవిశంకర ఖర్షిక వినతి పత్రాన్ని అంద జేశారు. గ్రంథాలయ శాఖ చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని కొనసాగిస్తుందని, ప్రతి ఆదివారం విద్యార్థులు ఇందులో పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నక్షలదిన్నె బీడీసీ రవిశంకర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

23న సింహాద్రిపురం మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈనెల 23న సింహాద్రిపురం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో సభా భవనంలో ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అధికారులు సమావేశానికి పూర్తి సమాచారంతో రావాలని ఆయన కోరారు.

టిడిపి నేత జయరామిరెడ్డిని పరామర్శించిన తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెకు చెందిన టిడిపి జిల్లా కార్యదర్శి ఎస్వీ జయరామిరెడ్డిని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పరామర్శించారు. జయరామిరెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై కడప బాలాజీ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న తులసిరెడ్డి గురువారం కడపకు వెళ్లి జయరామిరెడ్డి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ ఉపవైద్యులతో చికిత్స పొందుతున్న గంగరాజును కూడా పరామర్శించారు, ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉత్తన్న, వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేష్, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-పులివెందుల టౌన్ : విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎఇ జగదీశ్వర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కడప రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లు తొలగింపు కార్యక్రమం చేపట్ట మన్నారు. శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఎఇ కోరారు.

వాడవాడలా బెల్ట్ షాపులు

ప్రజాశక్తి - ఖాజీపేట

కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోందని, వాడవాడలా బెల్ట్ షాపులు వెలిశాయని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రామచంద్రారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ డి.మురళీమోహన్‌రెడ్డి ఆరోపించారు. ఖాజీపేటలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బెల్ట్ షాపులు విచ్చలవిడిగా వెలిశాయని తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్రంలో 60 వేలకు పైగా బెల్ట్‌షాపులు ఉన్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని, దాన్ని ప్రజలు ఇంటికి సాగనంపే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ పనులు ప్రారంభమై ఖరీఫ్ సీజన్ వచ్చినా, ఇంతవరకు అన్నదాత సుఖీభవ గురించి ఏమాత్రం ఆలోచన చేయలేదని, రైతులను మోసం చేసి వంచించి అధికారంలోకి వచ్చారని వారన్నారు. రానున్న రోజుల్లో వైసిపిదే అధికారమన్నారు.

అంతర పంటగా కంది సాగు

ప్రజాశక్తి-వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన కందులను టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి రైతులకు అందజేశారు. మండలంలోని నందిపల్లె గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కందుల పంపిణీ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా బిటెక్ రవి మాట్లాడుతూ పంటల్లో అంతర్ పంటగా కంది సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, రామగంగిరెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఉత్తమ సేవలందించాలి

ప్రజాశక్తి-ఖాజీపేట : అగ్రహార వ్యవసాయ పరపతి సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులకు ఉత్తమమైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని, సహకార సంఘాన్ని బలోపేతం చేయాలని ఎంపీడీవో దివిజ సంపత్ అన్నారు. గురువారం ఖాజీపేట కార్యాలయంలో నూతనంగా ఎంపికైన అగ్రహార వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు హరినాథ్ రెడ్డిని ఆమె సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పాల్గొన్నారు.

పాపాఘ్ని నదిని కాపాడండి

ప్రజాశక్తి-చక్రాయపేట వెలిగల్లు ప్రాజెక్టు నుండి పాపాఘ్ని నదిని కాపాడాలని, ఆక్రమణకు గురవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధ్రువకుమార్ రెడ్డి ఆరోపించారు. గురువారం తహశీల్దార్ విజయకుమారికి ఆక్రమణలకు గురైన పాపాఘ్ని నది కాపాడాలని వినతిపత్రం అందించారు. పాపాఘ్ని నది తీర ప్రాంతంలో కొందరు వ్యక్తులు అక్రమంగా పంటలు సాగు చేయడం వలన పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. గాలివీడు నుండి వేంపల్లె వరకు నదిలో పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. గతంలో కూడా ఈ నది ఆక్రమణకు గురైందని, అప్పట్లో వరదల కారణంగా నదీ తీర ప్రాంతాలు కొట్టుకుపోయాయని ,అయినా కూడా తిరిగి కొందరు ఆక్రమణదారులు నదిలో పైర్లు సాగు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో చక్రాయపేట మండల అధ్యక్షుడు రామాంజనేయులురెడ్డి, వేంపల్లె మండల అధ్యక్షుడు బీరాల రామకృష్ణ, జిల్లా నాయకులు యామయ్య, బద్రినాథ్, మండల నాయకులు నరేంద్ర, ఆంజనేయులు నాయక్, బద్రప్ప, నరేంద్ర, రమణారెడ్డి, సాయి, వినయ్, శివారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్యామ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గొలుసు దొంగతనాల నిందితుడు అరెస్టు

రూ.15 లక్షల చోరీ సొత్తు స్వాధీనం : డిఎస్‌పి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కడప అర్బన్

మహిళల మెడలో వేసుకున్న బంగారు గొలుసులను లాక్కొని వెళ్లే దొంగను పెండ్లిమర్రి పోలీసులు అరెస్టు చేసినట్లు డిఎస్‌పి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం డిఎస్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతని వద్ద నుంచి మహిళల మెడలలోంచి లాక్కున్న ఆరు బంగారు గొలుసులను, హీరో హోండా బండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడు జమ్మలమడుగు నియోజకవర్గ దేవగుడికి చెందిన నవీన్‌గా గుర్తించామని పేర్కొన్నారు. వైవీయూనివర్సిటీ వద్ద స్కూటర్‌లో వెళ్తున్న నవీన్‌ను అరెస్టు చేశారని తెలిపారు. అతని వద్ద నుంచి 1.5 కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని విచారించగా మరో 6 కేసుల్లో ఉన్నట్లు తేలిందన్నారు. ఒంటరి మహిళలను టార్గెట్ చేసి మంచినీళ్లు అడిగి చైన్ స్నాచింగ్‌కు పాల్పడతాడని పేర్కొన్నారు. నిందితుడు స్వగ్రామంలో కూరగాయల వ్యాపారం, ఆటో డ్రైవింగ్ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. తెలియని వ్యక్తులు ఎవరైనా ఒంటరిగా వచ్చి మంచినీళ్లు ఇవ్వమని అడిగితే జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఒంటరిగా ఉండే మహిళలు వీలైనంతవరకు అపరిచిత వ్యక్తులతో దూరంగా ఉండాలని పేర్కొన్నారు. కేసులో ఎంతో చాకచక్యంగా నిందితున్ని పట్టుకున్న కడప రూరల్ సిఐ, ఎస్ఐ, వివిఎన్ పల్లి,పెండ్లిమర్రి ఎస్ఐ సిబ్బందిని అభినందించారు.

గుడిలో హుండీ చోరీ

ప్రజాశక్తి - కమలాపురం టౌన్

మండలంలోని పందిళ్లపల్లి గ్రామంలో ఈ మధ్యనే పునర్నిర్మాణం చేయబడిన బోగదమ్మా అమ్మవారి గుడిలో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. స్థానికుల వివరాల మేరకు రాత్రి దొంగలు తలుపులకు ఉన్న తాళం పగులగొట్టి హుండీని రంపంతో తొలగించి గుడి పక్కన ఉన్న పాడుబడ్డ భవనంలోకి తీసుకెళ్లారు. అందులోని డబ్బును అపహరించారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం నుండి రాత్రి వరకు పందులు పట్టుకొనే వారు కొందరు అక్కడే ఉన్నట్లు వాళ్లే ఈ దొంగతనం చేసి ఉండొచ్చు అని స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. విషయాన్ని స్థానిక పోలీసులకు తెలిపామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

కలుషిత నీటితో పశువులకు అనారోగ్యం

చిన్నవరదాయపల్లె వద్ద ఉన్న ప్రొద్దుటూరు నుంచి వస్తున్న మురుగు కాలువ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చిన్నవరదాయపల్లె, నాగులపల్లె గ్రామాల వద్ద పశువులు కలుషిత నీరు తాగడం, అందులో మునగడం వల్ల సమస్యలు వస్తున్నాయి. ప్రొద్దుటూరు నుంచి మండల పరిధిలోని చిన్న వరదాయపల్లి గ్రామం వద్దకు మురుగునీరు వచ్చి చేరుతోంది. మేతకు వెళ్లే పశువులు ఈ నీటిలో కలియదిరుగుతూ అనారోగ్య బారిన పడుతున్నాయి. పశువులు ఈ నీటిని తాగడం వల్ల అస్వస్థతకు గురవుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ నీటి ఆధారంగా మెలకెత్తిన గడ్డి తినడం వల్ల కూడా పశువులు అనారోగ్య బారిన పడతాయని, పశువులు కాలువ నీరు తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. తరచుగా ఈ నీటిని తాగడంతో పశువులు అస్వస్థతకు గురవుతూ సమస్యలు అధికంగా వస్తున్నాయని మండల పశువైద్యాధికారి మొహమ్మద్ గౌస్ తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రొద్దుటూరు నుండి మురుగు కాలువ ప్రవహించే గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండి పశువులు తాగడానికి గ్రామ పంచాయతీ నీటిని వినియోగించాలని సూచించారు. పశువులకు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని అధికారులు మురుగు నీరు ప్రవహిస్తున్న కాలువలోకి పశువులు దిగకుండా ఏర్పాట్లు చేపడితే ఉపయోగకరంగా ఉంటుంది. రైతులు కూడా ఈ కాలువ వైపు పశువులను వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాంట్రాక్టు టీచింగ్ ప్యాకల్టీకి జీతాలు పెంచాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటిలో పని చేస్తున్న కాంట్రాక్టు టీచింగ్ ప్యాకల్టీ ఉద్యోగులకు జీతాలు పెంచాలని కాంట్రాక్టు టీచింగ్ ప్యాకల్టీ గెస్ట్ అసోసియేషన్ నాయకుడు నజీర్ హుసేన్ కోరారు. గురువారం వేంపల్లెలో ఉన్న టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డిని నజీర్ హుసేన్ ఆధ్వర్యంలో కలిసి జీతాలు పెంచాలంటూ వినతిపత్రం అందజేశారు. విద్య అర్హత ప్రాతిపదికన తమ డిజిగ్నేషన్ మార్చాలని కోరారు. కూటమి ప్రభుత్వం కాంట్రాక్టు ప్యాకల్టీని గుర్తించి జీతాలు పెంచి శాశ్వత పరిష్కారం చేసేందుకు సమాన పనికి సమాన వేతనమైన ఇప్పించాలని కోరారు. సిఎం దృష్టికి తీసుకొని వెళ్లి న్యాయం చేస్తామని బిటెక్ రవి వారికి హామీ ఇచ్చారు.

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు

అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలోని శ్రీరాం నగర్ ప్రాంతంలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిన పథకాలకు సంబంధించి కరపత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, వేమా కుమార్, డక్కా రమేష్, బాలకష్టారెడ్డి, పీరా సాహెబ్, పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

మురికి కాలువ నుండి విముక్తి కలిగించాలి

ప్రొద్దుటూరు : స్థానిక మాదిగ కాలనీలో ఉన్న మురికి నీటిని కొత్తపల్లి కాలువలో కలిపి మురికి నీటి నుండి తమకు విముక్తి కలిగించాలని రాష్ట్ర దళిత సమాఖ్య అధ్యక్షుడు కొత్తపల్లి ఎల్లయ్య కోరారు. ఆమేరకు గురువారం ఇంజనీరింగ్ సెక్షన్ అధికారి శ్రీనివాసులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడంపల్లె 16వ వార్డు మాదిగ కాలనీలో సైడ్ కాలువ పొంగి చెరువు కుంటలను తలపిస్తోందన్నారు. ప్రతిదినం కాలనీవాసులు మురికి నీరు దుర్వాసన భరిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. పబ్లిక్ రోడ్డుపై నిలిచిన నీటి వల్ల నరసింహ స్వామి ఆలయ భక్తులు గుడిలోనికి వెళ్లాలంటే మురికి నీటిలో దిగక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సిమెంట్ రోడ్డుకు సైడ్ కాలం నిర్మిస్తే కాలనీలోని మురికి నీరు కొత్తపల్లి కాలువలో కలుస్తుందని సూచించారు. శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. స్పందించిన అధికారి రెండు మూడు రోజులలో సైడ్ కాలం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బ్రహ్మయ్య మాదిగ వర్గం జిల్లా అధ్యక్షుడు గడ్డం నరసింహులు మాదిగ, రాయలసీమ పరిర రక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాపరెడ్డి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కన్వీనర్ నాగేంద్ర, ఆవుల రాజా, సగబాల ఓబులేసు, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి మార్గంలో నడవాలి

ఎర్రగుంట్ల : విద్యార్థులు తల్లిదండ్రులను గౌరవించడంతోపాటు క్రమశిక్షణతో మెలుగుతూ మంచి మార్గంలో నడవాలని మానవత స్వచ్ఛంద సేవ సంఘం సెంట్రల్ కమిటీ డైరెక్టర్స్ రామాంజనేయులరెడ్డి, రాటాల గోపి సూచించారు. పట్టణంలో జడ్.పి.హెచ్ బాలుర పాఠశాలలో గురువారం కెరీర్ గైడెన్స్ మోరల్ వాల్యూస్ అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. టెన్త్ క్లాస్, నైన్త్ క్లాస్ విద్యార్థులకు ఈ సందర్భంగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం రామాంజనేయులురెడ్డి, మానవత సంఘం నాయకులు బాల ఎల్లారెడ్డి, రఘురామిరెడ్డి, మల్లికార్జున రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాఘవరెడ్డి, సతీష్, తిరుపాల్రెడ్డి, మేడా రమేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

అవినీతికి చక్రవర్తి ఎమ్మెల్యే 'పుట్టా'

ప్రజాశక్తి - చాపాడు

అవినీతికి చక్రవర్తి మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అని మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మైదుకూరు వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అవినీతి చేయకుండానే కోట్లాది రూపాయలు ఏ విధంగా సంపాదించారో సుధాకర్ యాదవ్ తెలపాలన్నారు. గత టిడిపి హయాంలో తాను ఎమ్మెల్యేగా అసైన్డ్ కమిటీ చైర్మన్‌గా ఉన్నప్పటికీ తనకు తెలియకుండానే సుధాకర్ యాదవ్ సోదరులకు భూమి ఏ విధంగా వచ్చిందో తెలపాలన్నారు. ఏడాది కాలంలోనే మైదుకూరులో నలుగురు సీఐలను ఎందుకు మార్చారో తెలపాలన్నారు. తను చెప్పినట్లు వైసిపి నాయకులపై కేసులు బనాయించకపోతే బదిలీలు తప్పడం లేదన్నారు. పోలీసు వ్యవస్థను వాడుకొని అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. తిప్పిరెడ్డిపల్లె చెరువులో మట్టి అమ్ముకున్నది ఎవరో తెలపాలన్నారు. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చేసుకోకుండా మెగా కంపెనీ వారిని ఇబ్బందులకు గురిచేసింది ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. గత మున్సిపల్ ఎన్నికలలో తన పార్టీ నాయకులను కష్టపడి గెలిపించుకున్నామన్నారు. రాష్ట్రంలో ఒకటి, రెండు సీట్లకే పరిమితమైన మున్సిపాలిటీల్లో కూడా టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత చైర్మన్‌లను మార్చుతుంటే మైదుకూరులో 12 మంది కౌన్సిలర్లు ఉన్నప్పటికీ మార్చలేని పరిస్థితి ఎందుకు ఉందన్నారు. ఎన్నికలలో అన్ని విధాలా నష్టపోయిన ధనపాల జగన్‌ను ఎందుకు ఆదుకోవడం లేదన్నారు. చైర్మన్ మాచనూరు చంద్రపై అవిశ్వాస తీర్మానం పెడితే తమ పార్టీ కౌన్సిలర్లు పూర్తిగా మద్దతు ఇస్తారన్నారు. 2014-19 మధ్యకాలంలో మైదుకూరు మున్సిపాలిటీలో అవినీతి జరిగితే అధికారంలోకి రాగానే అవినీతిపరులను శిక్షించామన్నారు. తన హయాంలో అవినీతి జరిగింటే ప్రస్తుతం నిరూపించుకోవాలన్నారు. తెలుగుగంగ కాలువకు, చెరువులకు నీటిని వదిలే అంశాన్ని కూడా గొప్పగా చెప్పుకోవడం ఏమిటని ఆయన ఎద్దేవా చేశారు. తాను అవినీతికి పాల్పడి ఉంటే మీలా కోట్లాది రూపాయలు సంపాదించే వాడినన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు నామమాత్రంగా అందుతున్నాయని వివరించారు. సమావేశంలో వైసిపి నాయకులు సుబ్బయ్య, ఎసికె వెంకటరమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

జగన్ మెప్పు కోసమే లోకేష్‌పై ఆరోపణలు

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మెప్పు పొందడానికి నారా లోకేష్‌పై ఆరోపణలు చేస్తున్నారని, లోకేష్‌ను టార్గెట్ చేసి మాట్లాడితే సహించేది లేదని మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ సతీష్ కుమార్‌రెడ్డిని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని తన నివాసంలో గురవారం మీడియాతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో సతీష్ కుమార్ రెడ్డి టిడిపి నాయకులపై తన స్థాయికి మించి మాట్లాడుతున్నారని తెలిపారు. 2005లో వేల్పుల కాల్పుల ఘటనలో సంబంధం లేకున్నా జంట హత్య కేసులు పెట్టించడమే కాకుండా వైఎస్ఆర్ గూండాల చేత చంపడానికి ప్రయత్నించిన ఘటనలు మరిచిపోయావా అని ప్రశ్నించారు. ఆ సమయంలో టిడిపి నాయకుల ఇళ్లపై దాడులు చేసి కుల్చింది వాస్తవం కాదా అన్నారు. గతాన్ని మరిచి ప్రస్తుతం వైఎస్ జగన్ మంచివాడు అని చెబుతుంటే సతీష్ రెడ్డి నైజం అర్థమవుతోందన్నారు. వైసిపి ప్రభుత్వం వస్తే లోకేష్ సింగపూర్ పారిపోతారని ఆరోపణలు చేస్తున్నారని, 2019లో వైసిపి ప్రభుత్వం వస్తే లోకేష్ ఎక్కడికి పారిపోలేదని, కుప్పం నుంచి విజయనగరం వరకు పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు తెలుసుకుని కూటమి ప్రభుత్వం అధికారం రావడానికి ముఖ్యపాత్ర వహించిన వ్యక్తి లోకేష్ అన్నారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులు చేసి ఉంటే నువ్వు వేసిన అక్రమ లే అవుట్‌లు, నువ్వు పెట్టిన పాఠశాలపై చర్యలు తీసుకుని ఉండేవారమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వైసిపి నాయకులు కుంభకోణాలు చేస్తే అరెస్టు చేయడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. కృష్ణా జలాలను పులివెందులకు తీసుకురావడం కోసం రూ.650 కోట్లు భూములు కోల్పోయిన వారికి ఇచ్చి నీళ్లు తెచ్చిన ఘనత చంద్రబాబుది అన్నారు. టిడిపిలో మీరు ఉన్నప్పుడు అనుచరులను వైఎస్ కుటుంబ సభ్యులు హత్యలు చేయించింది వాస్తవం కాదా అన్నారు. నిన్ను నమ్ముకుని పార్టీలో చాలామంది ఆర్థికంగా కాకుండా ప్రాణాలు కోల్పోయిన వారు కూడా ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తుగుట్ల రాఘవరెడ్డి, టిడిపి నాయకులు అంకిరెడ్డి, మైసూరా రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం

పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం వివిధ రకాల వైద్య చికిత్సల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నియోజ కవర్గంలోని 39 మందికి రూ.27,45,081అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, సహాయనిధి రావడానికి సహకరించిన ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలో రెండో విడత జరిగిన అడ్మిషన్లు పక్రియ పూర్తి అయినట్లు పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. గురువారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలోని సెంట్రల్ లైబ్రరీలో మిగిలిపోయిన సీట్లకు రెండో విడత అడ్మిషన్ల ప్రక్రి యను అధికారులు చేపట్టారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటికి సంబంధించి 91 సీట్లుకుగాను 60 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. మిగిలిన సీట్లకు త్వరలో విద్యార్థుల జాబితాను విడుదల చేస్తామని డాక్టర్ రవికుమార్ తెలిపారు. అడ్మిషన్లు పక్రియను పరిపాలన అధికారి పర్యవేక్షించి విజయవంతంగా పూర్తి చేశారు. రెండో విడతలో జరిగిన అడ్మిషన్ల ప్రక్రియలో అనంతపురం పట్టణానికి చెందిన మరుగుజ్జు విద్యార్థినైనా సనత్‌కుమార్‌కు పదో తరగతిలో మంచి మార్కులు సాధించడంతో మొదటి అడ్మిషన్‌ను అందించారు. కార్యక్రమంలో డీన్ అకడమిక్ రమేష్ కైలాష్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ రమేష్, ఫైనాన్స్ అధికారి కోటేశ్వరి, అసోసియేట్ డీన్స్ రాఘవరెడ్డి, రఫీ, నవీన్, పిఆర్‌ఓ తిరుపతి రెడ్డి, అధికారులు లింగమూర్తి, జ్ఞాన వెంకట్ కోనప్ప, పవన్ కుమార్ పాల్గొన్నారు.

దళితులను కించపరిచేలా వ్యవహరిస్తే ఊరుకోం

ఖాజీపేట : దళితులను కించపరిచేలా ఎవరైనా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోమని, అలాంటివి సహించబోమని రాష్ట్ర మాల మహానాడు రామోజీ వర్గం రాష్ట్ర ఉపాధ్యక్షులు గున్నంపాటి వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం బీసీ కాలనీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జమ్మలమడుగుకు చెందిన ఓ రాజకీయ నేత దళిత సంఘం నాయకులు రామోజీ ఇమ్మానియేల్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. ఆయన ఏ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తి కాదన్నారు. కించపరిచేలా మాట్లాడితే సహించేదిలేదని హెచ్చరించారు.

IN THE COURT OF HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE, KADAPA

O.S.No. 1057/2024

Canara Bank, Rep. by its Branch Manager, Sankarapuram Branch, Kadapa ...Plaintiff

Vs

Y. Obulesu, S/o.V. Santenna, aged about 53 years, Agriculturist, Resident of D.No.3-98,A-Obayapalli, Veerapunayanapalli Manadal, YSR Kadapa District. ...Defendant

NOTICE

The above referred the plaintiff bank has filed suit for recovery in O.S.No.1057/2024, in the above court and same is posted for your appearance on 30.07.2025, at 10:30 A.M, if you're not appear before the Hon'ble Court, the Hon'ble court will take appropriate steps against you in your absence.

//By Order of the Hon'ble Court//

G.VENKATESWARA REDDY,
Advocate,
KADAPA.

రాజశ్రీ ప్రొద్దుటూరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 526/2020

సగిలి సుబ్బారెడ్డి, S/o గంగిరెడ్డి, ప్రొద్దుటూరు టవున్. ...వాది

Vs

పపుడిప్పు రాధా విజయలక్ష్మి, W/o పి.వెంకట రమణారెడ్డి, డోర్‌నెం.7/3019-ఎ, మేడపైన, బయమ్మగారి వీధి, శ్రీనివాసనగర్, ప్రొద్దుటూరు టవున్. ...ప్రతివాది

దావా సమన్

దావాలోని వాది నీ పైన మీ మధ్య కుదిరిన ఆస్థి విక్రయం గురించిన లావాదేవీ విషయమై కుదిరిన ఒప్పందం మేరకు 11.12.2018 తేదీన రూ.1,00,000-00లు మరియు 15.12.2018 తేదీన రూ.5,00,000-00లు నీ పేరట వాది నీ బ్యాంక్ అకౌంటులో నగదు డిపాజిట్ చేసినా డు. అయితే అట్టి ఆస్థికి రస్తా లేనందున నిన్ను తిరిగి డబ్బు వడ్డీతో సహా వాపస్ చేయమని వాది అడుగగా చెల్లించనందున రికవరీ కోసం వాది నీ పైన పై తెలిపిన కోర్టులో దావా దాఖలు చేసినాడు. అట్టి దావాలో నీకు ఏదైనా ఆక్షేపణలు వున్న యెడల 28.07.2025 తేదీన పగలు గం.10.30ని॥లకు హాజరై తెలుపుకోవలయును. లేనంతట నీ పరోక్షమున దావా తీర్మాణించబడును.

సి.సుదర్శన్ రెడ్డి
అడ్వకేట్,
ప్రొద్దుటూరు.

విలేకరులతో మాట్లాడుతున్న బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి

ముస్లిం యువతకు అండగా ఉంటాం

- దాడి చేయని వారిపై కేసులు ఉండవు : బిటెక్ రవి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని పక్కీర్‌పల్లెకు చెందిన బాలిక అదృశ్యంకు సంబంధించి పోలీసుస్టేషన్‌పై దాడి చేసిన కేసులో ఊరు విడిచి ఇతర ప్రాంతాల్లో తలదాచుకొంటున్న ముస్లిం యువత అందరూ రావాలని వారందరికీ టిడిపి అండగా ఉంటుందని పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లె రోడ్డు భవనాల శాఖ అతిథిగృహంలో ముస్లిం నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 7న పోలీసుస్టేషన్‌పై జరిగిన సంఘటనకు సంబంధించి క్లారిటీ ఇచ్చేందుకు వచ్చానని తెలిపారు. మాజీ సిఎం జగన్‌రెడ్డి ఇడుపులపాయకు వచ్చిన రోజే బాలిక అదృశ్యం అయితే చంపేశారని పుకార్లు సృష్టించి కొందరు పోలీసుస్టేషన్‌పై దాడి చేశారన్నారు. మాజీ సిఎం జగన్ ఎక్కడికైనా వచ్చాడంటే పరామర్శ, లేకపోతే రాజకీయం అనేది కామన్‌గా ఉంటుందని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా పోలీసుస్టేషన్‌పై దాడి చేసిన వారిపైన కేసులు పెడతారే తప్పా, దాడి చేయని వారిపై కేసులు పెట్టారని తాను భరోసా ఇస్తున్నట్లు చెప్పారు. ఊరు విడిచి వెళ్లిన ముస్లింలకు తాను అండగా ఉంటానని బిటెక్ రవి భరోసా ఇచ్చారు. ప్రజాప్రతినిధులుగా ఉండే మాజీ జడ్పీటీసీ, ప్రస్తుత జడ్పీటీసీ అక్కడికి ఎందుకు వచ్చారని ఆయన ప్రశ్నించారు. ఆ పెద్ద మనుషుల సమక్షంలోనే పోలీసుస్టేషన్‌పై దాడి జరిగిందని ఆరోపించారు. అనంతరం పక్కీర్‌పల్లెకు వెళ్లి మహిళలతో సంఘటనపై చర్చించారు. విలేకరుల సమావేశంలో మాజీ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఖాద్రీ, టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, తక్కల షరీఫ్, యాసిన్, అబ్దుల్, జబిబుల్లా, డక్కా రమేష్, వేమా కుమార్, టిడిపి నేతలు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం తహశీల్దార్‌గా కార్తీక్

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం తహశీల్దార్‌గా కార్తీక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఉన్న తహశీల్దార్ ఒంటిమిట్టకు వెళ్లగా, ఆయన స్థానంలో కడప కలెక్టరేట్ పిఓటిలో పనిచేసే కార్తీక్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రత్యేకదృష్టి పెడతామన్నారు. సిపిఎం మండల కార్యదర్శి సునీల్ తహశీల్దార్‌ను కలిసి మండలంలో పెండింగ్‌లో ఉన్న పలు సర్టిఫికెట్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. భూ సమస్యలు కూడా పరిష్కరించాలన్నారు.

బాధ్యతలు చేపడుతున్న కార్తీక్

విద్యుత్ చౌర్యంపై అధికారుల తనిఖీ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలో వివిధ గ్రామాల్లో 40 మంది సిబ్బందితో 24 బ్యాచులుగా విద్యుత్ చౌర్యంపై గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 55 కేసులు నమోదయ్యాయి. రూ.2లక్షల వరకు అపరాధ రుసుం విధించారు. అనంతరం ఇఇ ఎన్.భరణికృష్ణ విద్యుత్ కార్యాలయం వద్ద సమీక్ష సమావేశం నిర్వహించారు. కరెంట్ బిల్లులు సకాలంలో చెల్లించేలా బిల్‌పై క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు. బిల్లు ఇచ్చిన 14రోజుల్లోపు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డిఇఇ కులాయప్ప, అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం ఫొటో లేకపోవడం గమనార్హం

ప్రజాశక్తి - చక్రాయపేట

గండి క్షేత్రంలో ఈ ఏడాది శ్రావణమాసం ఉత్సవాల ఆహ్వాన పత్రికలో డిప్యూటీ సిఎం వపన్‌కల్యాన్ ఫొటో లేకుండా శ్రావణమాస ఆహ్వాన పత్రిక ప్రచురించి ఆవిష్కరించడం గమనార్హమని, గండి దేవస్థాన అధికారులు వ్యవహరిస్తున్న తీరు జనసైనికుల మనోభావాలు కించపరిచేలా ఉన్నాయని జనసేన పులివెందుల సమన్వయకర్త డాక్టర్ హరీష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో హరీష్, జనసైనికులు దేవస్థాన సహాయ కమిషనర్ జె వెంకటసుబ్బయ్యను, చైర్మన్ కావలి కృష్ణతేజను ప్రశ్నించారు. తక్షణమే కొత్త పత్రికలు ప్రచురించాలని డిమాండ్ చేశారు. గండి క్షేత్రం ఆఫీసులో ముఖ్యమంత్రి ఫొటో మాత్రమే ఉండడం గమనార్హమన్నారు. కార్యక్రమంలో ఇడుపులపాయి జయచంద్ర, శ్యాం, మల్లి, కొండలపల్లె ఉదయ్, సాయి, దేవా లక్ష్మణ్ పాల్గొన్నారు.

రాష్ట్రపతిచే అవార్డు అందుకుంటున్న యువ ఐఎఎస్ మౌర్య

నాగులపల్లె వాసికి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు మండలం నాగులపల్లికి చెందిన ఐఎఎస్ నారపురెడ్డి మౌర్య రాష్ట్రపతి చేతల మీదుగా అవార్డు అందుకున్నారు. ఆమె తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తిరుపతి మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, ఇతర అంశాలలో ఉత్తమ ప్రతిభ చూపడంతో రాష్ట్రపతి అవార్డు అందజేశారు. నాగులపల్లె గ్రామానికి చెందిన ప్రజలు తమ గ్రామానికి చెందిన ఐఎఎస్‌కు అవార్డు రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

IN THE COURT OF SPECIAL MAGISTRATE :: NANDYAL
MC No: 16 / 2022

1. S. షాహిన్
2. S. ఫయాజ్ తనజు
3. S. హర్షియా. ...పిటీషనర్స్

V/s

సయ్యద్ అమీనిద్దీన్ తండ్రి సయ్యద్ రసూల్ వయసు 29 సం, ఇండియన్ ముస్లిం, హౌస్ కీపింగ్ వర్క్ అట్ కువైట్, H. No. 8-642 సాయిపేట, కడప టౌన్ మరియు జిల్లా. ...రెస్పాండెంట్

రెస్పాండంట్ కు నోటీస్

పై కేసులో పిటీషనర్స్ మెయింటెనెన్స్ కోరి రెస్పాండంట్ పైన పిటీషన్ దాఖలు చేసియున్నారు. మీకు పోస్ట్ ద్వారా కోర్టు నుండి ఎన్నిసార్లు నోటీసులు పంపించిన తీసుకోనందునపై కోర్టువారి ఆదేశాల మేరకు రెస్పాండెంట్ నోటీస్ గాను తేదీన 05-08-2025 ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు గాని మీ తరపు వకీల్ గాని హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షంగా తీర్మానం చేయబడును తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేదీ : 05-08-2025

ఇట్లు
డి.ప్రతాప్ రెడ్డి,
బి.వి.మధుసూదన్ ,
పిటీషనర్స్ తరపు అడ్వకేట్స్,
నంద్యాల.